ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మహబూబాబాద్
బుధవారం 7 ఆగస్టు 2024





మానుకోట మునిసిపల్ కార్యాలయంలో ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మునిసిపల్ చైర్మన్, ఫ్లోర్‌లీడర్లు, కౌన్సిలర్లు

సార్‌కు ఘన నివాళి

- తెలంగాణ ఉద్యమంలో ఆయన చేసిన సేవలను గుర్తు చేసిన వక్తలు
- ఆశయసాధనకు పాటుపడాలని పిలుపు
- జిల్లాలో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి

వివరాలు : 8 లో..



మహబూబాబాద్ పట్టణంలోని పంచాయతీరాజ్ ఎస్ఈ కార్యాలయం ఇదే(ఫైలింగ్ ఫొటో)

పీఆర్ ఎస్ఈ ఆఫీస్.. తరలిపోయేనా..?

- మానుకోట జిల్లాకు అన్యాయం
- ప్రభుత్వానికి అందిన తరలింపు ప్రతిపాదన
- ఆపడంపై స్పందించని స్థానిక ప్రజాప్రతినిధులు
- మూన్నాళ్ల ముచ్చటగానే మిగులుతోందని అభిప్రాయాలు



మహబూబాబాద్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ గిరిజన జిల్లా, పార్లమెంట్ నియోజకవర్గ కేంద్రంలో ఉన్న పంచాయతీరాజ్ సూపరింటెండెంట్ ఇంజనీరింగ్ కార్యాలయం ములుగు జిల్లా కేంద్రానికి తరలిపోతోందన్న ఆందోళన అందరిలోనూ కనిపిస్తోంది. ఈ కార్యాలయాన్ని తరలించేందుకు విస్తృత ప్రయత్నాలు జరుగుతున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 11 నెలల క్రితమే పంచాయతీరాజ్ సూపరిండెంట్ ఇంజనీరింగ్ కార్యాలయం మంజూరు చేసింది. కార్యాలయం ఏర్పాటు చేసి, ఎంతో ఘనంగా ప్రారంభించుకున్నప్పటికి ఈ కార్యాలయం తరలింపుతో మూణ్నాళ్ల ముచ్చటగానే మారనుంది. ఇప్పటికే ఎస్ఈ కార్యాలయం తరలింపు చేయాలని ప్రభుత్వానికి ఓ ప్రతిపాదన అందింది. దీంతో ఈ కార్యాలయం ములుగు జిల్లా కేంద్రానికి తరలించడానికి రేపో, మాపో ప్రభుత్వం నుంచి జీవో వెలువడుతుందని ప్రచారం కొనసాగుతోంది. ఇంతా ప్రచారం జరుగుతున్నా.. ఆ కార్యాలయం తరలింపును ఆపేందుకు స్థానిక ప్రజాప్రతినిధులు ఎవరు స్పందించడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. దీంతో మహబూబాబాద్ జిల్లాకు తీరని అన్యాయం జరుగనుంది.

ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం ఇలా..

గత కొన్నేళ్ల క్రితం మహబూబాబాద్ నియోజకవర్గంగా ఉన్న సమయంలోనే ఇక్కడ బస్టాండ్ సమీపంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం ఏర్పాటు చేశారు. ఈఈ సర్కిల్ పరిధిలో ఏడు సబ్‌డివిజన్‌లు పని చేస్తున్నాయి. మహబూబాబాద్, గూడూరు, డోర్నకల్, గార్ల, తొర్రూరు, మరిపెడ సబ్ డివిజన్లుగా ఏర్పాటు కాగా, గతేడాది క్రితం ఇల్లెందు కూడా సబ్ డివిజన్‌గా ఏర్పాటు చేసి మహబూబాబాద్ పరిధిలోనే కలిపారు. ఒక్కొక్క డివిజన్ పరిధిలో ఒక్కొక్క డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (డీఈఈ)లు పనిచేస్తుండగా, జిల్లాలోని ఆయా మండలా నుంచి 23 మంది వరకు అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ)లు పనిచేస్తున్నారు. వారితో పాటు జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో ఆఫీస్ సిబ్బంది పనిచేస్తున్నారు.

ఎస్ఈ కార్యాలయం ఏర్పాటు ఇలా..

మహబూబాబాద్ జిల్లా కేంద్రం కావడంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం గతేడాది సెప్టెంబర్ నెలలో సూపరిండెంట్ ఇంజనీరింగ్ కార్యాలయంను మంజూరు చేసింది. ఈఈ కార్యాలయం పైన ఫస్ట్‌ఫ్లోర్‌లో ఎస్ఈ కార్యాలయం ఏర్పాటు చేశారు. సెప్టెంబర్ మాసంలో అప్పటి రాష్ట్ర గిరిజన, స్త్రీశిశు సంక్షేమశాఖ మంత్రి సత్యవతిరాథోడ్ చేతుల మీదుగా కార్యాలయాన్ని ఎంతో ఆర్భాటంగా ప్రారంభించారు. అక్టోబర్ 1 నుంచి ఈ కార్యాలయంలో కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. మొదటిసారి ఎస్ఈగా రఘువీరారెడ్డి పనిచేసి, ఆ తర్వాత ములుగు ఈఈ అజయ్‌కుమార్‌ను ఇన్‌చార్జ్ ఎస్ఈగా నియమించింది. ఈ ఎస్ఈ కార్యాలయం పరిధిలో.. మహబూబాబాద్, ములుగు సర్కిల్‌గా ఏర్పాటు చేశారు. ములుగులో నలుగురు డిప్యూటీ ఇంజనీర్‌లు (డీఈ)లు, మరో పదిమంది ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఏఈ)లు, కార్యాలయం సిబ్బంది పని చేస్తున్నారు. మహబూబాబాద్‌లో ఏడు డివిజన్లు ఏర్పాటు కాగా, డీఈలతోపాటు 23మంది ఏఈలు పనిచేస్తున్నారు.

ములుగుకు తరలించడానికి సిద్ధం..

మహబూబాబాద్-ములుగు కేంద్రాలకు వారధిగా ఉన్న ఎస్ఈ కార్యాలయం తరలింపును ములుగుకు తరలించడానికి రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. అందుకోసం కాంగ్రెస్ ప్రభుత్వంలోని ఓ కీలకనేత ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించినట్లు తెలుస్తోంది. రేపో, మాపో ప్రభుత్వం నుంచి కూడా తరలింపు ఉత్తర్వులు (జీవో) విడుదల కానున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఆ ఉత్తర్వులు అందింతే మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఎస్ఈ కార్యాలయంను ములుగుకు తరలించడానికి అధికారులు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. కాగా, గతంలో ఉన్న పాతపద్ధతిలోనే వరంగల్‌లో ఎస్ఈ కార్యాలయం ఉండేది. తిరిగి ఈ కార్యాలయాన్ని మహబూబాబాద్ నుంచి వరంగల్‌కు తరలించి, ఆ తర్వాత ములుగు, భూపాలపల్లి జిల్లాలను కలిపి ఓ సర్కిల్‌గా ఏర్పాటు చేసి ములుగు కేంద్రంగా ఎస్ఈ కార్యాలయం ఏర్పాటు చేసే మరో అవకాశం ఉన్నట్లు కూడా ప్రచారం జరుగుతోంది. ఎస్ఈ కార్యాలయంలో ఈ తరలింపు వార్త సిబ్బంది నుంచి గుప్పుమంటోంది. ఇప్పటికే జిల్లా కేంద్రంలో నీటిపారుదల శాఖ (ఐబీ) ఎస్ఈ కార్యాలయం గత నాలుగేళ్ల క్రితం ఏర్పాటు చేసి విజయవంతంగా అభివృద్ధి పథంలో నడుస్తోంది. అయితే పంచాయతీరాజ్ కార్యాలయం మాత్రం తరలించడానికి పూనుకున్నారు. జిల్లాలో ఎన్నో అభివృద్ధి పనులు జరుగుతు న్నాయి. అలాంటి కార్యాలయం ములుగుకు తరలివెళ్తే అభివృద్ధి కుంటుపడడమే కాకుండా కాంట్రాక్టర్లు కూడా దూరం వెళ్లే ఇబ్బందులు పడే పరిస్థితులు వస్తున్నాయి.

స్పందించని ప్రజాప్రతినిధులు..

జిల్లాలో గత కొద్దిరోజులుగా పంచాయతీరాజ్ ఎస్ఈ కార్యాలయం తరలింపు ప్రయత్నాలు జరుగుతున్నప్పటికి స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి కేంద్రంగా ఉన్నప్పటికి ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు స్పందించకుండా మౌనం వహిస్తున్నారని అనేక విమర్శలు వస్తున్నాయి. మహబూబాబాద్ జిల్లాను అభివృద్ధి చేసే పంచాయతీరాజ్ ఎస్ఈ కార్యాలయం తరలిస్తే అనేక అభివృద్ధి పనులకు అటంకం ఏర్పడనుంది. కాగా, పంచాయతీరాజ్ ఎస్ఈ కార్యాలయం తరలింపు విషయంపై ఇన్‌చార్జ్ ఎస్ఈని ఫోన్‌లో సంప్రదించడానికి ప్రయత్నించగా, ఆయన అందుబాటులోకి రాలేదు.

నూతన జీపీగా దుబ్బతండా

దంతాలపల్లి, ఆగస్టు 6 : మండలంలోని తూర్పుతండా శివారు దుబ్బతండాను నూతన గ్రామపంచాయతీగా ఏర్పాటు చేస్తూ గెజిట్ జారీ అయినట్లు ఎంపీవో అప్సరపాషా తెలిపారు.దంతాలపల్లిలో మంగళవారం ఆయన మాట్లాడుతూ రానున్న పంచాయతీఎన్నికల నేపథ్యంలో గెజిట్‌ను జారీ చేస్తూ ఆదేశాలు జారీ అయ్యాయన్నారు. నూతన జీపీ విధివిధానాలను సంబంధిత జిల్లా అధికారులు చేపట్టనున్నారన్నారు. ఈ నేపథ్యంలో తూర్పుతండాకు వేరుగా, దుబ్బతండా జీపీ శివారు రేఖ్యాతండా, మేఘ్యాతండాలను కలుపుతూ పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి.

'స్వచ్ఛదనం-పచ్చదనం'తో ఆరోగ్యం : ఎమ్మెల్యే



నెల్లికుదురులో మొక్కను నాటుతున్న ఎమ్మెల్యే మురళీనాయక్

నెల్లికుదురు, ఆగస్టు 6 : స్వచ్ఛదనం-పచ్చదనంతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ తెలిపారు. నెల్లికుదురు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణంలో మంగళవారం స్వచ్ఛదనం-పచ్చదనం, విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో పోలంబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మొక్కలు నాటి, మాట్లాడారు. సీజనల్ వాధులు సోకకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మొక్కల పెంపకంతో కాలుష్యాన్ని నివారించవచ్చన్నారు. నాటిన మొక్కలు సంరక్షించుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మండల అధికారులు అందుబాటులో ఉండి ప్రజకు సేవలు అందించాలన్నారు. మండలంలో విద్యుత్ సమస్యలు ఉన్నాయని అధికారులు పరిష్కరించాలన్నారు. రైతులకు ఇబ్బంది కలగకుండా విద్యుత్ సేవలు అందించాలన్నారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా మరమతులు చేపట్టాలని అధికారులకు సూచించారు. తహసీల్దార్ కె.రాజు, ఎండీవో బాలరాజు, మం డల ప్రత్యేకాధికారి మరియన్న, కాంగ్రెస్ నాయకులు గొల్లపెల్లి ప్రభాకర్‌గౌడ్, హెచ్.వెంకటేశ్వర్లు, ఎదళ్ల యాదవరెడ్డి, నాయిని సత్యపాల్‌రెడ్డి, కాసం లక్ష్మారెడ్డి, బాలజీనాయక్, జెల్ల వెంకటేష్, మౌనేందర్, యాకసాయిలు, జిలుకర యాలాద్రి పాల్గొన్నారు.

ఆరోగ్య కార్యక్రమాల అమలులో
జిల్లా అగ్రభాగాన నిలవాలి

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 6 : జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలులో జిల్లాను అగ్రభాగాన నిలపాలని జిల్లా వైద్యాధికారి కళావతిబాయి సూచించారు. మహబూబాబాద్ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో మంగళవారం ప్రోగ్రాం అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆగస్టు 10 నుంచి 22 వరకు గంగారం, కోమట్లగూడెం, కొత్తగూడ, గంధంపల్లి, మూల్కనూర్, బయ్యారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిల్లో జరిగే బోధవ్యాధి నిర్మూలన మాత్రలు పంపిణీని విజయవంతం చేయాలని సూచించారు. ప్రతీ నెలలో జరిగే ఆశా సమావేశాలకు ప్రోగ్రాం అధికారులు హాజరు కావాలని, జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన పెంపొందించాలని పేర్కొన్నారు. జిల్లాలో సిజేరియన్ కాన్పుల శాతం ఎక్కువగా ఉందని ఆందోళన వ్యక్త పరుస్తూ తల్లుల సమావేశంలో నార్మల్ డెలివరీపై అవగాహన కల్పించాలని చెప్పారు. సాధారణ ప్రసవాల వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించాలని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఇచ్చే మందులను ఉపయోగించుకునేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో వైద్యాధికారులు మురళీధర్, నాగేశ్వర్‌రావు, లక్ష్మీనారాయణ, శ్రవణ్, జాదవ్, ప్రసాద్, రవీందర్, వాహిద్ అలీ, వాణి, రాజు, గోవర్ధన్ పాల్గొన్నారు.

స్థాయికి మించి వైద్యం చేస్తే కఠిన చర్యలు

మరిపెడ : ఆర్ఎంపీలు, పీఎంపీలు స్థాయికి మించి వైద్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని డీఎంహెచ్‌వో కళావతిబాయిహెచ్చరించారు. మరిపెడలోని పలు ప్రైవేట్ క్లినిక్‌లను తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా శంకర్ అనేవ్యక్తి ప్రథమ చికిత్స కేంద్రాన్ని ఏర్పాటు చేసుకొని లెటర్‌హెడ్‌పై డాక్టర్‌గా చలామణి అవుతూ రోగులకు హైఫవర్ ఇంజక్షన్లు, స్టెరాయిడ్స్ ఉపయోగిస్తున్నట్లు గుర్తించి ఆ క్లినిక్‌ను సీజ్ చేయించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ప్రజలు ప్రైవేట్ క్లినిక్‌లకు వెళ్లి డబ్బులు వృథథా చేసుకొవొద్దని సూచించారు. పీహెచ్‌సీ డాక్టర్ రవి, ప్రసాద్, డీపీఎంవో రవీందర్‌రావు, కేవీ రాజు, ఆర్ఐ శరత్ పాల్గొన్నారు.

పలు మండలాల్లో దంచి కొట్టిన వాన

- మరిపెడలో 96.2 మిల్లీమీటర్ల అత్యధికం
- రోడ్లపై చెట్లు తొలగించిన ఎస్సై దీపికరెడ్డి



ఆకేరు.. జలకళ

మహబూబాబాద్ అగ్రికల్చర్, ఆగస్టు 6 : జిల్లాలో మంగళవారం తెల్లవారుజామున పలు మండలాల్లో వర్షం దంచికొట్టింది. ఉదయం 4.30 గంటల నుంచి 7 గంటల వరకు ఏకధాటిగా వర్షం పడింది. మరిపెడమండలంలో 96.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ఇది రాష్ట్రంలోనే అత్యధిక వర్షపాతంగా నమోదైంది. మరిపెడతో పాటు చిన్నగూడూరు, గార్ల, బయ్యారం, డోర్నకల్, కురవి, కేసముద్రం, మహబూబాబాద్, గూడూరు, నర్సింహులపేట, గంగారం మండలాల్లో ఓ మోస్తారు వర్షం కురిసింది. పత్తి, వరి చేన్లు వరద నీటితో మునిగిపోయాయి. మహబూబాబాద్ మండలంలో ఈదురు గాలులు వీచి చెట్లు విరిగిపడ్డాయి. చిన్న గూడూరు మండలంలోని ఆకేరుకు వరద నీరు ప్రవహిస్తోంది. నిన్నటి వరకు చిన్నగూడూరులోని ఆకేరువాగులో నీరులేకపోయి ఉదయం కురిసిన వర్షం, ఎగువ కురిసిన వర్షాలకు ఆకేరుకు వరదపోటెత్తింది. చెరువుల్లో నీరు చేరి నిండుతున్నాయి. పలుచోట్ల వరి, పత్తి చేన్లలో నీరు నిలిచింది. గార్ల మండలంలోని పాకాల వాగులో రాంపురం బ్రిడ్జిపై నుంచి గత 20 రోజులుగా ప్రవహిస్తున్న వాగు ఉధృతి అలాగే ఉంది. మహబూబాబాద్ మండలంలోని జంగిలిగొండ శివారు దూద్యతండా వద్ద బలమైన ఈదురు గాలులు వీయడంతో పలు చెట్లు విరిగి రోడ్డుపై పడడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. అదే సమయంలో మహబూబాబాద్ రూరల్ ఎస్సై దీపికరెడ్డి తన సిబ్బందితో పెట్రోలింగ్‌కు వెళ్లివస్తుండగా చెట్లు కూలిన సంఘటన చూసి వెంటనే సిబ్బందితో పక్క తండా నుంచి గొడ్డళ్లు తెప్పించి చెట్లు నరికించి తొలగించారు. రాకపోకలకు అంతరాయం కలుగకుండా చేశారు. సీరోలు మండలం కాంపెల్లిలో బస్టాండ్‌లోకి వరద నీరు చేరి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వ్యవసాయ భూముల్లోకి వరదనీరు చేరింది. 365 జాతీయ రహదారిపై ఉన్న కల్వర్టు వద్ద వరద నీరు ప్రవహించింది.



దూద్యతండ రహదారిపై కూలిన చెట్లను తొలగిస్తున్న పోలీసులు

జిల్లాలో 709.8 మిల్లీమీటర్ల వర్షపాతం..

జిల్లాలో మంగళవారం ఉదయం పలు మండలాల్లో భారీ వర్షం కురిసింది. మరిపెడలో 96.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఇది రాష్ట్రంలోనే అత్యధికంగా ఉంది. జిల్లాలోని చిన్నగూడూరులో 86.4, కొత్తగూడలో 33.8, గంగారంలో 43.2, బయ్యారంలో 64.4, గార్లలో 66.8, డోర్నకల్‌లో 65.0, కురవిలో 65.0, మహబూబాబాద్‌లో 49.6, గూడూరులో 45.4, కేసముద్రంలో 53.6, నెల్లికుదురులో 24.8, నర్సింహులపేటలో 44.4, దంతాలపల్లిలో 16.2, తొర్రూరులో 11.4, పెద్దవంగరలో 8.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, వెరసి 709.8 మిల్లీమీటర్ల వర్షపాతంనమోదైంది. జిల్లాలో సగటున 44.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.



నర్సింహులపేట మండలం పత్తిచేనులో వరద నీరు

'ఉపాధి'పై అనుమానాలు!

లక్ష్యాన్ని మించి పనులు కల్పించడం పట్ల సందేహాలు

- తనిఖీలకు ప్రత్యేక కేంద్ర బృందాల ఏర్పాటు
- త్వరలో క్షేత్రస్థాయి పరిశీలనకు ఉమ్మడి జిల్లాకు రాక
- రికార్డులను సిద్ధం చేస్తున్న డీఆర్‌డీవో అధికారులు

హనుమకొండ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): పేదలకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకం తీరుతెన్నులపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లా అధికారులు రికార్డుల్లో చూపిన మేరకు వాస్తవంగానే ఉపాధి పనులు జరిగాయా? హాజరైన కూలీల సంఖ్య సక్రమంగానే ఉందా? అనే సందేహాలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ అనుమానాలకు చెక్‌పెట్టేలా కేంద్రం క్షేత్రస్థాయిలో విస్తృత తనిఖీలకు శ్రీకారం చుడుతోంది. ఇందుకోసం కేంద్ర బృందాలు క్షేత్రస్థాయిలో పర్యటించి రికార్డులో చూపిన మేరకు ఉపాధి లెక్కలు సక్రమంగా ఉన్నాయా? ఏవైనా అవకతవకలు ఉన్నాయా? అంశాలపై నిగ్గుతేల్చనున్నాయి. ఇందులో భాగంగా ఆ బృందంలోని అధికారులు సంబంధిత రికార్డులను పరిశీలించడంతో పాటు అవసరమైతే కూలీలతో నేరుగా మాట్లాడతారు. త్వరలోనే కేంద్ర బృందాలు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని హనుమకొండ, వరంగల్, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో కూడా పర్యటించనున్నాయి. ఈ నేపథ్యంలో అయా జిల్లాల గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు రికార్డులను సిద్ధం చేస్తున్నారు.

గణాంకాల పెరుగుదలతో అనుమానాలు

జాతీయ ఉపాధి హామీ పథకంలో గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలోని 18 జిల్లాల్లో కూలీల సంఖ్య, పనిదినాలు 150శాతానికి పైగా పెరిగినట్టు గణాంకాలు వెలుగు చూడడంతో పనుల కల్పన, కూలీల హాజరుపై కేంద్ర ప్రభుత్వానికి అనుమానం కలిగింది. క్షేత్ర స్థాయిలో పనులను పరిశీలించి నిగ్గుతేల్చాలని నిర్ణయించింది. ఈ మేరకు పనులను పరిశీలించడానికి కేంద్ర బృందాలను పంపుతోంది. పని దినాల కల్పన విషయంలో కేంద్రానికి అనుమానం కలిగిన రాష్ట్రంలోని 18 జిల్లాల్లో ఉమ్మడి వరంగల్‌లోని ఆరు జిల్లాలు కూడా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈ ఆరు జిల్లాల్లో పనులు, కూలీలకు సంబంధించిన రికార్డులు సిద్ధం చేయాలని పంచాయతీ రాజ్ శాఖ కలెక్టర్లను ఆదేశించింది. కేంద్రప్రభుత్వం 2022-23 సంవత్సరంలో జరిగిన పని దినాలతో 2023-24 సంవత్సరంలో జరిగిన పనిదినాలను పోల్చి చూసింది. 2022-23లో ఉపాధి పని దినాలు 2023-24 కన్నా తక్కువగా ఉండడంతో అనుమానం పడుతోంది. ఇటీవల అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంగా సభకు రాష్ట ప్రభుత్వం సమర్పించిన 2024 సామాజిక, ఆర్థిక సర్వే రిపోర్టులో కూడా రాష్ట్రంలో 18 జిల్లాల్లో లక్ష్యానికి మించి పని దినాలు కల్పించినట్టు పేర్కొన్నది.



రికార్డులను సిద్ధం చేస్తున్న అధికారులు

కూలీల పని దినాలు పెరగడానికి నిర్దిష్టమైన కారాణాల అన్వేషణ కోసం కేంద్రబృందాలు ఈనెలలోనే తనిఖీలకు రానున్నాయి. ఈ క్రమంలో అధికారులు ఉపాధి పనులకు సంబంధించిన రికార్డులు సరి చూసుకుంటున్నారు. గ్రామ సభ తీర్మానం, ఎన్‌వోసీ పత్రం, పనుల ప్రదేశాల్లో బోర్డులు, చేసిన వ్యయం, ఎంత మందికి పని కల్పించామనే వివరాలు, పని ప్రారంభానికి ముందు, ఆ తర్వాత ఫొటోలు సేకరిస్తున్నారు. కేంద్రబృందాల తనిఖీల్లో అక్రమాలు వెలుగు చూస్తే ఉపాధి పనులకు నిధుల మంజూరులో ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఒత్తిడితోనే..


ఈ ఏడాది ఉపాధి పనులను లక్ష్యానికి అనుగుణంగా చేపట్టాలని సిబ్బందిని పురమాయించడంతో పాటు గతాని కంటే భిన్నంగా రోజువారీ ప్రగతిపై సమీక్షించడం వల్లే కూలీల హాజరు సంఖ్య పెరిగిందని అధికారులు చెబుతున్నారు. కేంద్ర బృందాల తనిఖీల్లో వాస్తవాలు వెలుగు

మిగతా 8వ పేజీలో..

లక్ష్యాలకు మించి..

మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద గ్రామీణ ప్రాంత ప్రజలకు పని దినాలు కల్పించే విషయంలో జనగామ జిల్లా రాష్ట్రంలోనే ఆరోస్థానంలో నిలవగా మహబూబాబాద్ జిల్లా అట్టడుగున 31వ స్థానంలో ఉంది. జనగామ జిల్లాలో 2022-23 సంవత్సరంలో 24.8లక్షల పనిదినాలను కల్పించాలని లక్ష్యంగా నిర్ణయించగా దానిని మించి 30.5 లక్షల పని దినాలను (123శాతం) పని దినాలను కల్పించి రాష్ట్రంలో ఆరో స్థానంలో నిలిచింది. వరంగల్ జిల్లాలో 17.5 లక్షల పని దినాలను కల్పన లక్ష్యంకాగా అంతకు మించి 20.3 లక్షల (116 శాతం) కల్పించి రాష్ట్ర స్థాయిలో 15వ స్థానంలో నిలిచింది. హనుమకొండ జిల్లా పనిదినాల లక్ష్యం 19.3లక్షలు కాగా 21.9లక్షల పని దినాలు (114 శాతం) కల్పించడంతో 17వ స్థానం, ములుగు జిల్లాలో 12.1లక్షల పని దినాలు లక్ష్యం కాగా 13.4లక్షల పని దినాలు (111 శాతం) కల్పించడంతో 24వ స్థానంలో నిలిచింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా 19.9లక్షల పనిదినాలను కల్పించాలన్నది లక్ష్యం కాగా 21.2లక్షల పని దినాలతో (106 శాతం) 29వస్థానంలో మహబూబాబాద్ జిల్లా 53.3లక్షల పని దినాలు లక్ష్యం కాగా 55.9 (105 శాతం) పని దినాలతో రాష్ట్ర స్థాయిలో అట్టడుగున 31వ స్థానంలో నిలిచింది.

వర్షాలు తక్కువ పడడం వల్లే పనులు పెరిగాయి



కె.నాగ పద్మజ, డీఆర్‌డీవో గ్రామీణాభివృద్ధి శాఖ, హనుమకొండ జిల్లా

2022-23 సంవత్సరంలో కన్నా 2023-24లో వర్షాలు తక్కువ పడ్డాయి. చాలినన్ని వర్షాలు పడకపోవడంతో చెరువులు, కుంటలు, బావులు ఎండిపోయాయి. దీంతో సహజంగానే గ్రామాల్లో వ్యవసాయ పనులు మందగించాయి. కూలీలకు వ్యవసాయ పనులు దొరకని పరిస్థితి ఏర్పడింది. దీంతో కూలీలంతా ఉపాధి హామీ పనులవైపు మళ్లారు. పైగా కేంద్ర ప్రభుత్వం కూడా ఉపాధి హామీ పథకం కింద ప్రతీ గ్రామ పంచాయతీలో గరిష్ఠంగా 25 మంది కూలీలకు పని కల్పించాలని లక్ష్యంగా నిర్ణయించింది. ఆ మేరకు కూలీలను సమీకరించాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. అదే లక్ష్యం ప్రకారం ఉపాధి పనులను చేయించాం. దీంతో సహజంగానే 2023-24 సంవత్సరంలో పని దినాలు పెరిగాయి. అంతేకాకుండా ఎన్ఆర్ఎం పనులు కూడా ఈ సారి ఎక్కువ చేశారు. దీనికితోడు వ్యవసాయాధారిత పనులను కూడా వీలైనంత మేరకు చేపట్టమన్నారు. ఈ కారణాలను ప్రభుత్వానికి రాసి పంపాము.

బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలి

బీసీ నేత జక్కని సంజయ్ కుమార్


సమావేశంలో మాట్లాడుతున్న జక్కని సంజయ్ కుమార్

హనుమకొండ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కోటా అమలు కోసం ఈనెల 10వ తేదీన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్కని సంజయ్ కుమార్ తెలిపారు. మంగళవారం హనుమకొండలోని ఒక హోటల్‌లో బీసీ రాజకీయ పోరాట సమితి యువజన విభాగం ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సంజయ్ కుమార్ మాట్లాడుతూ.. బీసీలకు 42 శాతం వాటా అమలుకు అన్ని బీసీ సంఘాలు, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలతో నిర్వహిస్తున్న ఈ సమావేశాన్ని బీసీలు విజయవంతం చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో భాగంగా కామారెడ్డిలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ జాతీయ నాయకుడు రాహుల్‌గాంధీ బీసీల కోసం పోరాటం చేస్తున్నారని, ఎన్నికల మేనిఫెస్టోలో బీసీ డిక్లరేషన్ ప్రకటించినందుననే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైందని, కనుక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీసీ డిక్లరేషన్‌ను తప్పక అమలుచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ రాజకీయ పోరాట సమితి యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి పంజల రేవంత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో బీసీ నాయకులు తిరుపతి, బొంగోని అభిలాష్ తదితర నాయకులు పాల్గొన్నారు.

మేడిగడ్డకు కొనసాగుతున్న వరద

మహదేవపూర్ రూరల్, ఆగస్టు 6: కాళేశ్వరం ప్రాజెక్టులో ప్రధానమైన మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రభావం కొనసాగుతోంది. మంగళవారం ఇన్‌ఫ్లో 3.62లక్షల క్యూసెక్కులు ఉండగా 85 గేట్లను ఎత్తి వచ్చిన నీటిని వచ్చినట్లే దిగువకు పంపిస్తున్నారు. బ్యారేజీ వద్ద గోదావరి ప్రవాహం సోమవారం 4.90 మీటర్ల ఎత్తులో ప్రవహిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఎగువన వర్షాలు కురుస్తుండటంతో బ్యారేజీ వచ్చే ఇన్‌ఫ్లో పెరుగుతున్నట్లు తెలిపారు. అన్నారం బ్యారేజీకి 3 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా 66 గేట్లను ఎత్తి, అంతే నీటిని దిగువకు పంపిస్తున్నట్లు పేర్కొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

వరంగల్ క్రైం, ఆగస్టు 6: కాకతీయ యూనివర్సిటీ పోలీసులు మంగళవారం పేకాటాడుతున్న వారిని అరెస్టు చేశారు. కేయూ పోలీస్‌స్టేషన్ పరిధిలోని స్వాగత్ గ్రాండ్ హోటల్‌లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేశారు. రూ.1లక్ష 23వేల నగదు స్వాధీనం చేసుకుని తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నారు. అదుపులోకి తీసుకున్న వారిని విచారణ నిమిత్తం కేయూ పోలీసులకు అప్పగించారు. ఈ విషయాన్ని టాస్క్‌ఫోర్స్ సీఐ రాజు ధృవీకరించారు.


హనుమాన్ చాలీసా పారాయణం చేస్తున్న బెగ్లూర్ భక్త బృందం

ఐలోని మల్లన్న సన్నిధిలో హనుమాన్ చాలీసా పారాయణం

ఐనవోలు, ఆగస్టు 6: ఐనవోలు మల్లికార్జునస్వామి దేవస్థానంలో మంగళవారం హనుమాన్ చాలీసాతోపాటు భక్తిగీతాల పారాయణం అత్యంత భక్తిశ్రద్ధలతో కొనసాగింది. భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం బెగ్లూర్ గ్రామానికి చెందిన హనుమాన్ చాలీసా పారాయణ బృందం సుమారు 25 మంది పాల్గొని పారాయణం చేసి ఆధ్యాత్మికతను చాటారు. భక్తులు ఎంతో భక్తితో ఆలకించారు. ఈ కార్యక్రమంలో ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు, ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్, బృందం అధ్యక్షుడు దారం రమణయ్య, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

గుట్కా పట్టివేత

వరంగల్ క్రైం, ఆగష్టు 6: హసన్‌పర్తి మండల కేంద్రంలో రూ.6,800 విలువైన నిషేధిత గుట్కాను స్థానిక పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం ఏఎస్ఐ మల్లిఖార్జున్, కానిస్టేబుళ్లు రాజశేఖర్, నాగరాజు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా మండల కేంద్రంలో అన్నం సురేష్ గుట్కా విక్రయిస్తున్నట్లు సమాచారం అందింది. పోలీసులు సురేష్ నిర్వహిస్తున్న కిరాణషాపుపై దాడులు నిర్వహించి గుట్కాను స్వాధీనం చేసుకున్నారు. పరారయ్యేందుకు ప్రయత్నించిన సురేష్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ మల్లిఖార్జున్ తెలిపారు.

అద్దింటోళ్లంటే.. అంత అలుసా?

కొందరు యజమానుల తీరుతో కిరాయిదారుల అవస్థలు

హనుమకొండ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): నగరంలో అద్దె ఇంట్లో ఉన్న వారి అవస్థలు అన్నీ ఇన్నీ కావు. యజమానులు షరతులు పెడుతూ ఏమాత్రం ఇబ్బంది కలిగినా తక్షణమే ఖాళీ చేయిస్తున్నారు. అలాగే చుట్టుపక్కల ఉండే సొంతిళ్ల వారితో ఇబ్బం దులు తప్పడం లేదు. వారు చూసే చిన్నచూపు, సూటిపోటి మాటలతో అద్దె కుంటుంబం తీవ్ర మనస్తాపానికి గురవుతున్నారు. అయితే తప్పని పరిస్థితుల్లో కాలం వెల్లదీస్తున్నారు. బతుకు దెరువుకోసం నగరానికి వలస వచ్చే వారి సంఖ్య రోజు రోజుకూ పెరిగిపోతోంది. దీనికి తోడు పైచదువుల కోసం నగరానికి వచ్చే విద్యార్థులు కూడా అధిక సంఖ్యలో ఉంటున్నారు. కొందరికి మాత్రమే హాస్టల్ వసతి సమకూరుతోంది. మిగతా వారంతా అద్దె ఇళ్లలోనే తలదాచుకోక తప్పడం లేదు. ప్రైవేటు హాస్టళ్లలో ఉండాల్సి వస్తే భరించలేనంతగా ఫీజులు ఉంటున్నాయి. ఆర్థిక స్తోమత లేని గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు నలుగురైదుగురు కలిసి ఇల్లు అద్దెకు తీసుకొని ఏదో విధంగా తక్కువ ఖర్చుతో నెట్టుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు.

షరతులతో బెంబేలు

పట్టణీకరణ పెరిగిన తర్వాత అద్దె ఇళ్లు పిరమయ్యాయి. అపార్టుమెంట్ సంస్కృతి పెరిగిన తర్వాత ఇండిపెండెంట్ ఇల్లు దొరకడం కష్టంగా మారింది. దొరికినా అద్దె రేట్లు ఆకాశన్నంటుతున్నాయి. అపార్ట్‌మెంట్లలోనూ ఇదే పరిస్థితి. ఈ క్రమంలో ఎక్కడైనా టు లెట్ బోర్డు కనిపిస్తే ఎగిరి గంతేసి వెళ్లి వాకబు చేస్తే యజమాని పెట్టే నిబంధనలతో చుక్కలు కనిపిస్తున్నాయి. కనీస సౌకర్యాలు లేకపోయినా అద్దెలు మాత్రం దండిగానే వసూలు చేస్తున్నారు. డిమాండ్‌ను బట్టి ఏటా 10 నుంచి 15శాతం పెంచుతున్నారు.


క్షణాలమీద ఖాళీకి ఒత్తిడి

యజమానులు అద్దెలను ఇష్టారాజ్యంగా పెంచడమే కాదు.. పెంచినంత అద్దె ఇవ్వడానికి అద్దెకున్నవారు ఏ మాత్రం తటపటాయించినా ఖాళీ చేయమని హుకుం జారీ చేస్తున్నారు. అలాగే తమతో ఏ చిన్న తగాదా వచ్చినా తట్టాబుట్టా సర్దుకోమని చెబుతున్నారు. కొన్ని సందర్భాల్లో తమ ఇంట్లో శుభకార్యం ఉన్నా, లేదా ఇతర దేశాలు, ప్రాంతాల్లో ఉండే కుమారులు, కుమార్తెలు వచ్చినా అద్దెకున్నవారిని నిర్ధాక్షిణ్యంగా ఖాళీ చేయిస్తున్నారు. మరమ్మతులు చేయించాలనుకున్నా, లేదా కూలగొట్టి మళ్లీ కట్టాలనుకున్నా కనీస ముందస్తు సమాచారం లేకుండానే ఖాళీ చేయాలని చెబుతున్నారు. మరో ఇల్లు వెతుక్కోవడానికి సమయం కూడా ఇవ్వడం లేదు. వాస్తవానికి అద్దెకున్నవారిని ఖాళీ చేయించాలనుకుంటే టెనెంట్ యాక్టు ప్రకారం ఇంటి యజమానులు కొన్ని నిబంధనలు పాటించాలి. అద్దెకున్నవారికి మూడు నెలలు ముందు సమాచారం ఇవ్వాలి. లేదా మరో ఇల్లు అద్దెకు దొరికే వరకు అవకాశమివ్వాలి. తక్షణం ఖాళీ చేయించే హక్కు లేదు. ఒక వేళ అలా చేస్తే అద్దెకున్నవారు సాయం కోసం పోలీసులను ఆశ్రయించవచ్చు.

దారుణంగా పెరిగిన అద్దెలు

నగరంలో పెరిగిన అద్దెలతో జనం అల్లాడిపోతున్నారు. నిన్నమొన్నటి వరకు ఉన్న ఇంటి అద్దెలతో పోల్చితే ఇప్పుడున్న అద్దెలు మరీ ఎక్కువగా పెరిగాయి. దీంతో పేదలు, సామాన్యులకు బాడుగ ఇళ్లలో ఉండడం కూడా భారంగా మారింది. ఇటీవల కాలంలో హైదరాబాద్ లాంటి నగరాల్లో ఇంటి అద్దెలు 9 శాతం పెరిగితే.. వరంగల్ నగరంలో 6 నుంచి 7 శాతానికి పెరిగాయి. ఇక బస్‌స్టేషన్, రైల్వేస్టేషన్, చౌరస్తా లాంటి ప్రాంతాల్లో ఉన్న ఇళ్లకు అద్దె ఒక రేటు, కాస్త దూరంగా ఉన్నవాటికి మరో రేటు. హనుమకొండ చౌరస్తా, బ్రాహ్మణవాడ, మచిలీబజార్, కాపువాడ, అలంకార్ జంక్షన్, కాజీపేట, నయీంనగర్, నిట్ కేయూ 100 అడుగుల రోడ్డు, కేయూ క్రాస్ రోడ్డు, అంబేద్కర్ జంక్షన్, ఎన్‌జీవోస్ కాలనీ రోడ్డు, టీచర్స్ కాలనీ, రెడ్డి కాలనీ, అడ్వకేట్స్ కాలనీ, బాలసముద్రం లాంటి నగరం నడిబొడ్డున ఉన్న కాలనీల్లో ఇళ్ల అద్దెలు భగ్గుమంటున్నాయి. సింగిల్ బెడ్ రూమ్ ఇళ్లు రూ. 5వేలు, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు రూ.7వేల నుంచి రూ.8వేలు, త్రిబుల్ బెడ్ రూమ్ ఇళ్లు రూ. 10వేల నుంచి రూ.15వేల మధ్య అద్దెలు ఉంటున్నాయి. కారు పార్కింగ్, ఇంటీరియర్ డిజైన్లు ఉంటే ఆ ఇళ్లకు వేరే రేటు ఉంటోంది. మెరుగైన సౌకర్యాలు ఉన్న ఇళ్ల అద్దెలు ఇంతకన్నా ఎక్కువనే పలుకుతున్నాయి. అపార్ట్‌మెంట్లలో అయితే డబుల్ లేదా త్రిబుల్ బెడ్ రూమ్ ఫ్లాట్ల అద్దె రేట్లు రూ.15 వేల నుంచి రూ.20వేల వరకు ఉంటున్నాయి. దానికి మెయింటనెన్స్ చార్జీల రూపంలో రూ.1500 నుంచి రూ.2వేలు అదనంగా తీసుకుంటున్నారు. దీంతో చాలామంది నగర నగర శివార్లలో ఉన్న కాలనీలోని ఇళ్లను ఆశ్రయిస్తున్నారు.

- ఏ మాత్రం అసౌకర్యమైనా తక్షణం ఖాళీకి ఒత్తిడి
- కాలనీవాసుల్లోనూ అద్దింటోళ్లపై చులకన భావం
- బ్రహ్మచారులు, నిమ్నవర్గాల వారికి దొరకటం గగనమే..
- భారీగా పెరిగిన అద్దె రేట్లతో ఇబ్బందులు



ఇళ్లు గగనమే

నగరంలో కొన్ని వర్గాల వారికి అద్దె ఇల్లు దొరక్కపోవడం గగనమే అవుతోంది. దళితుల లాంటి నిమ్నవర్గాలకు ఇళ్లు ఇవ్వడానికి అగ్రకులాల యజమానులు నిరాకరిస్తున్నారన్న అపవాదు ఉంది. టు లెట్ బోర్డు చూసి వెళ్లినవారిని మొదట కులమేంటని అడుగుతున్నారు. తక్కువ కులం వారైతే ఇళ్లు ఖాళీగా ఉన్నా లేవని చెప్పి పంపించేస్తున్నారు. చివరకు వారు దళితులకు చెందిన ఇళ్లలో అద్దెకు దొరికితే అదే అదృష్టంగా సర్దుకుపోతున్నారు. అలాగే, బ్రహ్మచారులకు ఇళ్లు అద్దెకు ఇవ్వడానికి యజమానులు వెనుకాముందాడుతున్నారు. పెళ్లీడుకువచ్చిన అమ్మాయిలున్న యజమానులైతే ససేమిరా అంటున్నారు. బ్రహ్మచారులకు ఇల్లు అద్దెకు ఇస్తే ఇబ్బందులు ఎదర్కొనవలసి వస్తుందన్న భయంతో వారికి నో చెబుతున్నారు. దీంతో బ్యాచిలర్స్ తమ స్నేహితుల ఇళ్లు, లేదా హాస్టల్ గదుల్లో తలదాచుకుంటున్నారు.

అర్ధంతరంగా ఖాళీ చేయించాడు

కుమారస్వామి, బాలసముద్రం, హనుమకొండ

నా ఆఫీసుకు దగ్గరగా ఉంటుందని అద్దె ఎక్కువైనా చెల్లించి హనుమకొండ బాలసముద్రంలోని ఒక అద్దె ఇంట్లో కుటుంబంతో రెండేళ్లుగా ఉంటున్నాను. అద్దె కూడా సకాలంలో చెల్లిస్తూ వచ్చాను. ఒక రోజు ఇంటి యజమానికి, మా కుటుంబ సభ్యులకు మధ్య చిన్న తగాదా ఏర్పడింది. అంతే.. యజమాని అప్పటికప్పుడు ఇల్లు ఖాళీ చేయించాడు. మరో మంచి ఇల్లు వెతుక్కునే అవకాశం కూడా ఇవ్వలేదు. దీంతో అద్దె ఎక్కువైనా సౌకర్యాలు లేకపోయినా దొరికిన ఇంట్లోనే అద్దెకు దిగాము.

కిరాయికి ఉండేటోళ్లా అని నిర్లక్ష్యంగా చూస్తున్నారు..

రామస్వామి, గోపాల్‌పూర్, హనుమకొండ

హనుమకొండలోని గోపాలపూర్‌లోని ఓ సంపన్నమైన కాలనీలో అద్దెకుంటున్నాము. అద్దె కాస్త ఎక్కువే అయినా సర్దుకుపోతున్నారు. కానీ చుట్టుపక్కల సొంతిళ్ల వారు మమ్మల్ని చిన్నచూపు చూస్తున్నారు. ఎవరైనా మా చుట్టాలు, స్నేహితులు మా ఇంటికి వచ్చే క్రమంలో అడ్రస్ అడిగితే గా కిరాయికి ఉన్నోళ్లా.. అంటూ హేళనగా మాట్లాడుతుండడం బాధ కలిగిస్తోంది. పొరుగువారు సొంతిల్లు ఉన్నదన్న పొగరుతో అద్దెకున్నవారిని చిన్నచూపుచూడడం తగదు.

దళితులమని అద్దెకు ఇల్లివ్వలేదు

శ్రీనివాస్, హనుమకొండ

నేను ఒక ప్రైవేటు సంస్థలో ఉద్యోగిని. బదిలీ కావడం వల్ల హనుమకొండకు వచ్చాను. మా ఆఫీసుకు, పైగా చౌరస్తాకు దగ్గరగా ఉంటుందని భావించి సమీప ప్రాంతంలో అద్దె ఇంటికోసం వెతికాను. ఇళ్లు ఖాళీగానే ఉన్నా దళితులమని చెప్పగానే ఓ ఇంటి యజమాని ఇల్లు అద్దెకు ఇవ్వలేమని సున్నితంగా చెప్పాడు. చాలా చోట్ల ఇదే పరిస్థితి ఎదుర్కొన్నా. చివరికు నా చిన్ననాటి స్నేహితుడిఇంటిలో అద్దెకు దిగాను.

ఇరుగుపొరుగు వారి చిన్నచూపు

అద్దెకున్నవారంటే ఇంటి యజమానికే కాదు.. ఇరుగు పొరుగువారికి కూడా చిన్నచూపే. వారితో సరిగా మమేకం కావడానికి కూడా ఇష్టపడడం లేదు. సొంతింటి ఇంటి దారులమన్న అహంతో అద్దెకు ఉంటున్నవారిని దూరంగా పెట్టడం కనిపిస్తోంది. కాజీపేట బాలాజీనగర్‌లో తమపై సొంతిళ్లవారు వివక్ష చూపిస్తున్నారని కొందరు అద్దెలకు ఉండే వారు ఆరోపిస్తున్నారు. కొందరు సొంతిళ్ల వారు అద్దెలకు ఉండే వారిపై యజమాలకు లేనిపోని మాటలు చెప్పి మరీ ఖాళీ చేయిస్తున్న పరిస్థితి ఉంది. దీనికి ఆ కాలనీకమిటీ కూడా వత్తాసు పలకడం విస్మయం కలిగిస్తోంది. బాల సముద్రంలోని ఓ కాలనీలో రాత్రి పూట తలుపుల శబ్దం వినబడుతోందని, పిల్లలు అరుస్తున్నారనే చిన్న చిన్న విషయాలపై పక్కింటివారు గొడవపడి యజమానికి చెప్పి మరీ ఖాళీ చేయించిన సందర్భాలున్నాయి.

అద్దెకుండే వారిలో ఎవరైనా చనిపోతే..

అద్దె ఇంట్లోని కుటుంబసభ్యుల్లో ఎవరైనా అనారోగ్యంతోగానీ, మరే ఇతర కారణాల వల్ల ఆస్పత్రిలో లేదా బయట చనిపోతే ఇంటి యజమానులు మృత దేహాన్ని ఇంటికి తీసుకురానివ్వడం లేదు. దీంతో చేసేది లేక కుటుంబసభ్యులు మృతదేహాన్ని అటునుంచి అటే శ్మశానానికి తీసుకువెళ్లి దహన సంస్కారాలు చేయాల్సి వస్తోంది. ఇంట్లో అద్దెకుంటున్నవారు పది రోజులు బయటనే ఉండి కర్మకాండల తర్వాతే ఇంట్లో అడుపెట్టాల్సి వస్తోంది.

రూ.కోటితో ఉడాయించిన వ్యాపారి?

రెండునెలల్లో భారీగా అప్పులు ● లబోదిబోమంటున్న బాధితులు

కేసముద్రం (మహబూబాబాద్ జిల్లా), ఆగస్టు 6: మహబూబాబాద్ జిల్లా కేసముద్రం స్టేషన్‌కు చెందిన ఓ వ్యాపారి అప్పులు చేసి సుమారు రూ.కోటితో ఉడాయించినట్లు ప్రచారం జరుగుతోంది. మండల కేంద్రంలోని పాన్‌షాప్‌లలో సిగరెట్లు, పాన్‌మసాలాలు, ఇతర సామగ్రిని హోల్‌సేల్‌గా సరఫరా చేసే ఈ వ్యాపారి కొద్దిరోజుల కిందట తన కుటుంబంతో సహా అదృశ్యమయ్యాడు. స్థానికంగా సొంత ఇల్లు, ట్రాలీ ఆటో ఉండడంతో పాటు నిత్యం వేల రూపాయల హోల్ సేల్ వ్యాపారం చేస్తుండడంతో అప్పు అడగగానే ఇచ్చారు. ఒక్కొక్కరి వద్ద రూ. లక్షల నుంచి రూ.10లక్షల వరకు అప్పులు తీసుకున్నట్లు సమాచారం. స్థానికంగా చిట్టిలు నిర్వహించే వారి వద్ద రూ.2లక్షల నుంచి రూ.5లక్షల చిట్టిల్లో చేరి మొదటి నెలలోనే అధిక కమీషన్‌తో ఎత్తుకున్నట్లు తెలిసింది. ఆ తర్వాతి రెండు, మూడునెలల వరకు సకాలంలో చిట్టీ డబ్బులు చెల్లిస్తూ అదృశ్యం కావడానికి రెండునెలలకు ముందు అప్పులు, ఎత్తుకున్న చిట్టీలు సుమారు రూ.కోటి వరకు పోగేసినట్లు తెలిసింది. కుటుంబం సహా ఫోన్ స్విచ్‌ఆఫ్ చేసుకొని ఇక్కడి నుంచి ఉడాయించడం ఓ పథకం ప్రకారమే తక్కువ కాలంలో ఎక్కువ అప్పులు చేసి, చిట్టీలు ఎత్తుకున్నట్లు అనుమానిస్తున్నారు. సొంత ఇల్లుపై బ్యాంకులో రూ.25 లక్షల వరకు రుణం తీసుకోగా, ట్రాలీఆటో ఫైనాన్స్‌లో తీసుకువచ్చిందని తెలుసుకున్న అప్పులిచ్చిన వారు లోలోపల లబోదిబోమంటున్నారు. ఈ విషయంపై పోలీసులను ఆశ్రయించేందుకు బాధితులు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. ఇక చిట్టీల వ్యవహారమంతా అనధికారికం కావడంతో ఎవరికి చెప్పుకునే పరిస్థితి లేకుండా పోయింది. ఇదిలా ఉండగా వ్యాపారంలో నష్టాలు రావడం, ఆన్‌లైన్ గేమ్‌లను ఆడడంతో దివాళా తీసి ఉడాయించినట్లు మరికొందరు భావిస్తున్నా రు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 6: తెలంగాణ ఓపెన్ స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఓపెన్ టెన్త్, ఇంటర్‌లలో ప్రవేశాల కోసం దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ మురాల శంకర్‌రావు మంగళవారం ఒక ప్రటనలో తెలిపారు. సెప్టెంబర్ 10 వరకు దరఖాస్తులు చేసుకునే అవకాశముందని పేర్కొన్నారు. అడ్మిషన్ ఫీజును ఆన్‌లైన్‌లో చెల్లించి వారికి అందుబాటులో ఉన్న ఓపెన్ స్కూల్ అధ్యయన కేంద్రాల్లో సంప్రదించి ప్రవేశాలు పొందాలని కోరారు. టెన్త్‌కు అడ్మిషన్ ఫీజు ఓసీలకు రూ.1550, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు రూ.1150 చెల్లించాలన్నారు. ఇంటర్‌లో ప్రవేశాలకు ఓబీసీలకు రూ. 1800, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు రూ.1500 ఆన్‌లైన్‌లో చెల్లించాలని తెలిపారు. పూర్తి వివరాలకు కోఆర్డినేటర్ శంకర్‌రావు (8008403631, 9396337572)ను సంప్రదించాలని ఆయన కోరారు.

ఊడిన గూడ్స్ రైలు బోగీల లింకు

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 6 : మహబూబాబాద్-తాళ్లపూసపల్లి రైల్వే స్టేషన్ల నడుమ అప్‌లైన్‌లో 434 మైలురాయి వద్ద వరంగల్‌వైపు వెళ్తున్న గూడ్స్‌రైలు బోగీల మధ్య లింక్ (కప్లింగ్) మంగళవారం ఊడిపోయి గూడ్స్ రైలు నిలిచి పోయింది. విషయం తెలుసుకున్న రైల్వే అధికారులు దానిని సరి చేసి అక్కడి నుంచి పంపించారు. దీంతో గూడ్స్ వెనుకాల వస్తున్న వందేభారత్ రైలును మానుకోట రైల్వేస్టేషన్‌లో సుమారు అరగంట పాటు నిలిపారు. గూడ్స్ రైలు బోగిలను సరి చేసి పంపించాక మానుకోట రైల్వేస్టేషన్ నుంచి వందేభారత్ రైలు కదిలి వెళ్లిపోయింది.

సర్వీసుల క్రమబద్ధీకరణకు హోంగార్డుల వినతి

వరంగల్ క్రైం, ఆగష్టు 6: రాష్ట్రంలోని హోంగార్డుల సర్వీసులను క్రమబద్ధీకరించాలని కోరుతూ మంగళవారం హైదరాబాద్‌లో డీజీపీ జితేందర్‌ను కలిసి హోంగార్డులు వినతిపత్రం ఇచ్చారు. సీనియారిటీ, విద్యార్హతల ఆధారంగా ఏదైనా యూనిఫామ్ సర్వీసులలో విలీనం చేయాలని కోరారు. ఆరోగ్య భద్రత, ఉద్యోగ భద్రత కల్పించాలని వారు విజ్ఞప్తి చేశారు. డీజీపీని కలిసిన వారిలో రాష్ట్ర హోంగార్డుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పుప్పాల అశోక్, వర్కింగ్ ప్రసిడెంట్ దయానంద్, జాయింట్ సెక్రెటరీ నారాయణరెడ్డి, పీఆర్‌వో రాజేంద్రప్రసాద్ ఉన్నారు.

వీరభద్రస్వామి దీక్షలో మంత్రి పొన్నం



వీరభద్రస్వామి మాలను ధరిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

భీమదేవరపల్లి, ఆగస్టు 6: కొత్తకొండ శ్రీవీరభద్రస్వామి నక్షత్ర దీక్షను బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం స్వీకరించారు. 27రోజులుగా ఉండే వీరభద్రస్వామి నక్షత్ర దీక్షను ఆలయ ముఖ్య అర్చకుడు, దీక్షల గురుస్వామి మొగిలి పాలెం రాంబాబు వీరభద్రస్వామి ఆలయంలో వీరభద్రుడి ముద్రికతో ఉన్న మాలను మంత్రి పొన్నం ప్రభాకర్ మెడలో వేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆలయ ఈవో కిషన్‌రావు పాటు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఎన్నికలకు ముందు తాను ఎమ్మెల్యేగా గెలిచి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే వీరభద్రస్వామి నక్షత్ర దీక్షలు తీసుకుంటానని మొక్కుకున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఎమ్మెల్యేగా గెలిచిన పొన్నం ప్రభాకర్ మంత్రిగా కూడా ప్రమాణస్వీకారం చేశారు. దీంతో 27రోజుల పాటు దేవాలయంలో నియమ నిబంధనలకు అనుగుణంగా పూజ కార్యక్రమాల్లో పాల్గొంటానని తెలిపారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కొత్తకొండ వీరభద్రస్వామి చరిత్రను రాష్ట్ర ప్రజలకు తెలిసే విధంగా చర్యలు తీసుకుంటానన్నారు. ద్వాదశ జ్యోతిలింగాల్లో ఒకటైనా శ్రీశైలం మల్లిఖార్జున స్వామిని సోమవారం దర్శించుకున్నానన్నారు. శ్రీశైలంలో దేవుడి పక్కనే భద్రకాళి సమేత శ్రీవీరభద్రస్వామి విగ్రహం ఉందన్నారు. ఇంత మహిమ కలిగిన ఈ దేవాలయాల్లో ఉమ్మడి కరీంనగర్, వరంగల్, మెదక్, ఆదిలాబాద్ జిల్లాల్లోని భక్తులు పెద్దఎత్తున తరలివస్తారన్నారు. ఈ విశ్వాసం భక్తులకు ఆకాంక్షలకు అనుగుణంగా వీరభద్రస్వామి దీక్ష తీసుకుంటారన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కిషన్‌రావు, బొమ్మ శ్రీరాంచక్రవర్తి, మంజులారెడ్డి, కొత్తకొండ దేవస్థానం మాజీ చైర్మన్లు పిడిశెట్టి కనకయ్య, చంద్రశేఖర్‌గుప్తా, చిట్టంపల్లి అయిలయ్య, మాజీ ఎంపీపీ అశోక్‌ముఖర్జీ, కేతిరి లక్ష్మారెడ్డి, మంగ రామచంద్రం, కొల్గూరి రాజు, ఆదరి రవీందర్, సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలీసు అధికారులకు డీజీపీ ప్రశంసలు



డీజీపీ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్న సీఐ శ్రీధర్‌రావు

వరంగల్ క్రైం, ఆగస్టు 6: హత్య కేసుల్లో నిందితులకు జీవిత ఖైదు శిక్ష పడటానికి కృషి చేసిన ఇద్దరు సీఐలతో పాటు గతంలో వరంగల్‌లో పనిచేసిన ఏసీపీ, ఎస్‌ఐలకు డీజీపీ జితేందర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందచేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర పోలీస్ ప్రధాన కార్యాలయంలో డీజీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోలీసు అధికారుల సమావేశంలో విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులకు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లకు ప్రశంసాపత్రాలు అందించారు. పత్రాలు అందుకున్న వారిలో ప్రస్తుతం సీసీఆర్‌బీలో పనిచేస్తున్న సీఐ శ్రీధర్‌రావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజమల్లారెడ్డి, మామూనూర్ సీఐ రవికుమార్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ సత్యానారాయణరెడ్డి, అడిషినల్ ఎస్పీ బోనాల కిషన్, తొర్రూరు ఎస్‌ఐ జగదీష్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాసుదేవరెడ్డి ఉన్నారు. కాగా, వీరిని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ అభినందించారు.

జర్నలిజంలో మార్పులు సహజమే..

సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్టు డాక్టర్ ఎస్.వెంకటనారాయణ



డాక్టర్ వెంకటనారాయణకు జ్ఞాపికను బహుకరిస్తున్న ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు

వడ్డెపల్లి, ఆగస్టు 6: మారుతున్న కాలానికనుగుణంగా జర్నలిజంలో మార్పులు సహజమేనని ఇండియాటుడే పూర్వప్రతినిధి, మల్టీ మీడియా ఇండిపెండెంట్ సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్టు డాక్టర్ ఎస్. వెంకటనారాయణ అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం జర్నలిస్టులతో చిట్‌చాట్ చేశారు. అనంతరం ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో డాక్టర్ వెంకటనారాయణ మాట్లాడుతూ.. ప్రస్తుతం జర్నలిజంలో వస్తున్న మార్పుల కనుగుణంగా డిజిటల్ మీడియా హవా చలాయిస్తోందని అన్నారు. బంగ్లాదేశ్‌లో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా భారత్‌తో స్నేహపూర్వకంగా ఉండాల్సిందేనని చెప్పారు. బంగ్లాదేశీయులు లండన్‌లో రెస్టారెంట్లు పెట్టుకున్నారని, అయితే పాకిస్తానీయులైనా, బంగ్లాదేశీయులైనా ఇండియన్ రెస్టారెంట్ పేరుతో నడిస్తారని చెప్పారు. భారతదేశం అంటే ప్రపంచమంతా తెలుసునని, బంగ్లాదేశ్ పేరు చెప్పితే ఎవరికీ తెలియదని అన్నారు. బంగ్లాదేశ్‌లో జరుగుతున్న అల్లర్లతో ఆ దేశ ప్రధాని షేక్‌హసీనా నేరుగా ఇండియాకు వచ్చారని పేర్కొన్నారు. అయితే ఇక్కడి ప్రధానిని కానీ మరెవరిని కలవలేదని అన్నారు. నేషనల్ సెక్యూరిటీ అడ్వయిజర్ మాత్రమే వెళ్లి మాట్లాడారని చెప్పారు. తాను ఏపీ సీఎం చంద్రబాబు జీవిత చరిత్ర రాస్తున్నానని తెలిపారు. ఈ నెల 22 నుంచి రెండు వారాల పాటు ఏపీలోని అమరావతిలో ఉంటానని చెప్పారు.

ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ కోశాధికారి బోళ్ల అమర్, ప్రెస్‌క్లబ్ బాధ్యులు గోకారపు శ్యామ్, విష్ణువర్ధన్, సీనియర్ జర్నలిస్టులు గడ్డం కేశవమూర్తి, పిన్న శివకుమార్, పీవీ మదన్‌మోహన్, వల్లాల వెంకటరమణ, చిలుముల్ల సుధాకర్, వేముల సదానందం, మెండు రవీందర్, అంతడుపుల శ్రీనివాస్, నన్నపునేని భరత్, జడ్పీ మాజీ చైర్మన్ సాంబారి సమ్మారావుతో పాటు యూనివర్సిటీ ప్రొఫెసర్లు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

రాష్ట్ర సాంఘిక సంక్షేమ వసతి గృహాల సెక్రటరీ అలుగు వర్షిణి



మహబూబాబాద్‌లోని సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో మొక్కను నాటుతున్న స్వచ్ఛదనం-పచ్చదనం ప్రత్యేకాధికారి అలుగు వర్షిణి

మహబూబాబాద్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్‌ను నిషేధించి, ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని 'స్వచ్ఛదనం-పచ్చదనం' జిల్లా ప్రత్యేకాధికారి, రాష్ట్ర సాంఘిక సంక్షేమ వసతి గృహాల సెక్రటరీ అలుగు వర్షిణి అన్నారు. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం కొత్తపేట, జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ హాస్టల్‌ను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొత్తపేటలో చేపట్టిన స్వచ్ఛదనం-పచ్చదనంలో గ్రామస్థాయిలో ప్రజలకు పూర్తి అవగాహన కల్పించి గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో స్వయం సహాయక బృందాలు, వీవోలు, పంచాయతీ సిబ్బందితో సమావేశాన్ని ఏర్పాటు చేసి గ్రామస్థాయిలో నిర్వహిస్తున్న స్వచ్ఛదనం-పచ్చదనం తీరు గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మొక్కను నాటా రు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. పాఠశాలలో తడిచెత్త, పొడిచెత్త వేరుచేయడం, ప్లాస్టిక్ రహిత సమాజం కోసం అనే నాటికను ప్రదర్శించగా పిల్లలతో కలిసి వీక్షించారు. అనంతరం వ్యాసరచన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. గ్రామ స్థాయిలో పారిశుధ్య పనులు పక్కాగా చేపట్టాలని, అంతర్గత రోడ్ల అభివృద్ధి, గ్రామంలో స్వచ్ఛత, పచ్చదనం ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం మహబూబాబాద్ జిల్లాకేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని సందర్శించి పిల్లలతో మాట్లాడారు. పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ మాట్లాడుతూ స్వచ్ఛదనం-పచ్చదనంను పక్కాగా నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుని ప్రత్యేకాధికారులను నియమించి క్షేత్రస్థాయిలో విజయవంతం చేస్తున్నామని చెప్పారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో, మానుకోట ఆర్డీవో అలివేలు, జిల్లా అధికారులు నర్మద, హరిప్రసాద్, తహసీల్దార్ భగవాన్‌రెడ్డి, దైవాదీనం, చంద్రస్వామి పాల్గొన్నారు.

కొత్త రేషన్ కార్డులకు ఎన్నికల గండం

- కార్డుల జారీకి సబ్ కమిటీని ఏర్పాటు చేసిన సర్కార్
- సబ్ కమిటీ నివేదిక తరువాత దరఖాస్తుల పరిశీలన
- త్వరలోనే జారీ చర్యలంటున్న అధికారులు
- పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడితే ప్రక్రియలో జాప్యమేనా?



హనుమకొండ సిటీ, ఆగస్టు 6: కొత్త రేషన్ కార్డుల జారీకి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కార్డుల జారీ ఉంటుందని ప్రకటించిన వెంటనే కేబినెట్ కూడా ఆమోదం తెలపడంతో పాటు కార్డుల జారీ విధానాల కోసం ప్రభుత్వం ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది. దీంతో హనుమకొండ జిల్లాలో రేషన్ కార్డుల జారీకోసం దరఖాస్తు చేసుకున్న వారితో పాటు కొత్తగా దరఖాస్తు చేసుకోవాలనే వారిలో ఆశలు చిగురించాయి. కానీ పంచాయతీ ఎన్నికలు వారిలో గుబులు పుట్టిస్తున్నాయి. రేపోమాపో పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ అనే సంకేతాలు ఉండగా.. అదే జరిగితే ఎన్నికల ప్రక్రియలో యంత్రాంగం తలమునలై కార్డుల జారీలో జాప్యం జరుగుతుందేమో అనే సందేహాలు నెలకొంది. కానీ ప్రభుత్వం సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటుందని లబ్ధిదారులు ఆశిస్తున్నారు.

సబ్ కమిటీ ఏర్పాటు

కొత్త రేషన్‌కార్డుల జారీ కోసం రాష్ట్ర ప్రభుత్వం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చైర్మన్‌గా, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ సభ్యులుగా మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేసింది. ఈ ఉప సంఘం పేదలకు రేషన్ కార్డులజారీకి సంబంధించిన విధి విధానాలను నిర్దేశించనుంది. ఆపై ముఖ్యమంత్రికి నివేదించిన అనంతరం రేషన్ కార్డుల జారీ ప్రక్రియ ఆరంభం కానుందని పౌర సరఫరాలశాఖ అధికారులు చెబుతున్నారు. సబ్ కమిటీ కార్డుల జారీ మార్గ దర్శకాలను రూపొందించిన తరువాత ప్రభుత్వం స్పష్టమైన నిబంధనలను వెల్లడి చేస్తోందని, ఆ తరువాత కార్డుల జారీ ప్రక్రియ జిల్లాలో ఆరంభం అవుతుందని పౌర సరఫరాల శాఖ అధికారులు అంటున్నారు.

తొమ్మిదేళ్లుగా నమోదుతోనే సరి

బీఆర్ఎస్ హయాంలో కొత్త రేషన్ కార్డుల జారీకి అర్హులైన పేదల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కొత్త కార్డులతో పాటు అదనంగా కుటుంబ సభ్యుల పేర్ల నమోదు దరఖాస్తులను చేపట్టారు. కానీ ఒక్క కార్డు జారీ కాలేదు. ఇలా తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ పాలన కార్డులను జారీ చేయకుండానే ముగిసింది. రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ అధికారం చేపట్టగానే రేషన్‌కార్డుల జారీకి సిద్ధమని ప్రకటించింది. ఇటీవల సబ్‌కమిటీ ఏర్పడడంతో త్వరలో కార్డులు వస్తాయని దరఖాస్తుదారులు ఆశపడుతున్నారు.

జిల్లాలో 5580 దరఖాస్తులు

హనుమకొండ జిల్లాలో రేషన్‌కార్డుల కోసం 5,580దరఖాస్తులు నమోదయ్యాయి. ప్రభుత్వం జిల్లాల వారీగా రేషన్‌కార్డుల దరఖాస్తుల సంఖ్యను కోరిన క్రమంలో జిల్లా యంత్రాంగం ప్రభుత్వానికి నివేదించింది. ప్రభుత్వం మార్గదర్శకాల మేరకు 5,580 దరఖాస్తుల పరిశీలన ఆరంభమై అర్హుల సంఖ్య నిర్ధారణ కానుంది. అదే విధంగా కుటుంబ సభ్యుల పేర్లు చేర్పుల ప్రక్రియ కూడా ఉండనుంది.

పంచాయతీ ఎన్నికల భయం

కొత్త కార్డుల జారీపై ఒక ఆనందం.. ఆ వెంటే పం చాయతీ ఎన్నికల భయం దరఖాస్తుదారులను వెంటా డుతోంది. రేపో, మాపో పంచాయతీ ఎన్నికలు జరుగనున్నాయనే సంకేతాలు, నోటిఫికేషన్ విడుదల అం శం దరఖాస్తుదారుల్లో సందేహాన్ని కలిగిస్తోంది. ఇదే జరిగితే కార్డుల జారీకి మళ్లీ అవరోధం తప్పని పరిస్థితి. పంచాయతీ ఎన్నికలు, ఆపై జిల్లా పరిషత్ ఎన్నికలు, కోడ్ ముగిసిన తరువాత అంతా సర్దుబాటు చేసే సమయం.. ఇదంతా జరిగే వరకు మరో మూడు నెలల బ్రేక్ తప్పదని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



కేయూ పీఎస్‌లో బాలుడితో సీఐ సంజీవ్

కిడ్నాపైన బాలుడు తల్లిదండ్రులకు అప్పగింత

వరంగ్ క్రైం, ఆగస్టు 6: బిస్కెట్లు ఇస్తానని చెప్పి.. బిట్టు అనే ఐదేళ్ల బాలుడిని కిడ్నాప్ చేయగా, గంట సమయంలో బాలుడిని పట్టుకున్న కేయూ పోలీసులు.. తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ సంఘటన మంగళవారం కాకతీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్టేషన్ పరిధిలోని పూరిగుట్ట ప్రాంతానికి చెందిన బాలుడు కిడ్నాప్ అయినట్లు సమాచారం అందుకున్న సీఐ సంజీవ్.. సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. వెతుకుతున్న క్రమంలో పోలీసుకాలనీకి చెందిన పంతేగాని కార్నేయస్ (రైల్వే ఉద్యోగి) అనే వ్యక్తి బండిమీద బాలుడిని తీసుకుని వెళుతుండగా అనుమానం వచ్చి పట్టుకున్నారు. విచారణలో బిట్టును కిడ్నాప్ చేసి తీసుకెళుతున్నట్లు నిర్ధారణ అయింది. కాగా, కార్నేయస్‌ను అదుపులోకి తీసుకుని బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించారు. బాలుడిని కిడ్నాప్ చేసిన నిందితుడు కార్నేయస్‌పై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు సీఐ సంజీవ్ తెలిపారు. కాగా, బిట్టు మహబూబాబాద్ జిల్లా ఉత్తర తండాకు చెందిన బోడ సురేష్ - ప్రియాంక దంపతుల కుమారుడు. పూరిగుట్ట వద్ద అమ్మమ్మ వినోద వద్ద ఉంటున్నాడు.

సైకిల్‌ను ఢీకొట్టిన కారు : ఒకరి మృతి


వెంకన్న (ఫైల్)

గూడూరు, ఆగస్టు 6 : సైకిల్‌ను కారు ఢీకొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందిన ఘటన మర్రిమిట్ట 365 జాతీయరహదారిపై మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై నగేష్ తెలిపిన వివరాల ప్రకారం. మర్రిమిట్టకి చెందిన ధనసరి వెంకన్న (40) ఉదయం 9.40 గంటలకు సమయంలో తన వ్యవసాయ భూమి వద్దకు సైకిల్ వెళ్తున్న క్రమంలో గూడూరు నుంచి నర్సంపేట వైపువెళ్తున్న గుర్తు తెలియని తెలుపురంగు కారు సైకిల్‌ను ఢీకొట్టింది. కారుడ్రైవర్ అతివేగంగా, అజాగ్రత్తగా నడిపి సైకిల్‌పై వెళ్తున్న వెంకన్నను వెనుక నుంచి ఢీకొట్టి, ఆపకుండా పారిపోయాడు. ఈ ఘటనలో ధనసరి వెంకన్నకు తలకు తీవ్రగాయాలు కాగా, స్థానికులు గూడూరు సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్సనందించారు. మెరుగైన వైద్యం కోసం వైద్యుల సూచనల మేరకు వరంగల్ ఎంజీఎంకు తరలిస్తుండగా మార్గమధ్యలో వెంకన్న మృతి చెం దాడు. మృతుడికి భార్య కవిత, కుమారుడు రంజిత్, కుమార్తె కీర్తన ఉన్నారు. మృతుని భార్య కవిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సీహెచ్.నగేష్ తెలిపారు. కాగా, ఈ ఘటనను నిరసిస్తూ మర్రిమిట్ట 365 జాతీయ రహదారిపై మృతుని బంధువులు, గ్రామస్థులు ఆందోళన చేపట్టారు. ధనసరి వెంకన్న అనే గిరిజనరైతును కారుతో అతివేగంగా ఢీకొట్టి ఆపకుండా వెళ్లిపోయిన కారు యాజమాని, డ్రైవర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జాతీయ రహదారిపై హెచ్చరిక బోర్డులు, స్పీడ్ కంట్రోల్ రాండర్ పెట్టకపోవడం వల్లనే మర్రిమిట్ట ప్రాంతంలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని బంధువులు ఆరోపిస్తున్నారు. వెంకన్న కుటుంబానికి తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

5 క్వింటాళ్ల నల్లబెల్లం పట్టివేత

నెల్లికుదురు, ఆగస్టు 6 : జామతండాలో మంగళవారం రాత్రి నల్లబెల్లం పట్టుకున్నట్లు ఎస్సై రమేస్ బాబు తెలిపారు. జామతండాకు చెందిన గుగులోత్ వెంకన్న ఇంట్లో 5 క్వింటాళ్ల నల్లబెల్లం 50 కిలోల పట్టిక నిల్వచేయగా పట్టుకొని సీజ్‌చేసి, వెంకన్నతో పాటు అదే తండాకు చెందిన బెల్లం వ్యాపారులు భూక్య సుమన్, గుగులోత్ శంకర్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమేష్ బాబు పేర్కోన్నారు.

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య


వాసు (ఫైల్)

కురవి, ఆగస్టు 6 : తట్టుపల్లి శివారు చంద్యతండాకు చెందిన మాలోతు వాసు (35) అప్పులబాధతో యాసిడ్‌తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం. మాలోతు వాసు గత నాలుగేళ్లుగా హైదరాబాద్‌లో డీసీఎం నడుపు తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో అప్పులు కావడంతో ఫైనాన్స్ వారు డీసీఎంను తీసుకుని వెళ్లారు. దీంతో మనస్తాపానికి గురైన వాసు ఈనెల 29న యాసిడ్ తాగాడు. కుటుంబసభ్యులు హైదరాబాద్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. మృతునికి భార్య స్రవంతి, ముగ్గురు కుమారులు ఉన్నారు. మృతదేహన్ని స్వగ్రామానికి తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

హిందీ గెస్ట్ టీచర్ పోస్టు భర్తీకి దరఖాస్తులు

కేసముద్రం, ఆగస్టు 6 : మండలంలోని కల్వల మోడల్ స్కూల్లో ఆరు నుంచి ఎనిమిదో తరగతి వరకు హిందీ బోధించేందుకు గెస్ట్ టీచర్ పోస్టుకు ఈనెల13న ధ్రువీకరణ పత్రాలతో నేరుగా డెమో తరగతులకు హాజరుకావాలని ప్రిన్సిపాల్ సీహెచ్.రవి కోరారు. డిగ్రీలో ద్వితీయభాష హిందీ, హెచ్‌పీటీ/బీఈడీలో హిందీ మెథడాలజీ చదివి టెట్ అర్హత సాధించిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. రూ.182ల చొప్పున గౌరవ వేతనంతో ప్రతీనెల గరిష్టంగా 100 పిరియడ్లు ఉంటాయని తెలిపారు.

'ఫర్నీచర్ల మాయం'పై నేడు విచారణ

దంతాలపల్లి, ఆగస్టు 6 : మండలంలోని తూర్పుతండా గ్రామపంచాయతీ 'ఫర్నీచర్ల మాయం' అనే శీర్షికన మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితం కావడంతో ఎంపీడీవో స్పందించారు. ఈసందర్భంగా ఎంపీడీవో వివేక్రమ్ మాట్లాడుతూ పంచాయతీ కార్యాలయానికి చెందిన వీల్‌చైర్‌ను జీపీ సిబ్బంది ముగ్గురు ఓ వ్యక్తికి అప్పగించినట్లు కార్యదర్శి పేర్కొన్నారని తెలిపారు. బుధవారం ఎంపీవో అప్సరపాషా ఆధ్వర్యంలో పూర్తిస్థాయి విచారణ అనంతరం బాధ్యులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ : ఏడీఏ

నర్సింహులపేట, ఆగస్టు 6: మండల కేంద్రంలోని పలుఎరువుల దుకాణాలను ఏడీఏ శోభన్‌బాబు మంగళవారం తనిఖీ చేశారు. ఈ-పాస్ మిషన్‌లో ఉన్న స్టాక్ ప్రకారం దుకాణాల్లో ఉన్ననిల్వలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో పెట్టుకొని సాగుకు సరిపడా ఎరువులు, యూరియా రైతులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎరువుల దుకాణాలపై రైతుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు అందినా చర్యలు తప్పవన్నారు. పత్తి, వేరుశెనగ, పెసర, మిర్చి సాగులో సమగ్రసస్యరక్షణ చర్యలు పాటిస్తేనే అధికదిగుబడులు సాధ్యమన్నారు. మండల వ్యవసాయ విస్తరణ అధికారులు రామకృష్ణ, కరిష్మా, మౌనిక, ఫర్టిలైజర్ యాజమానుల అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి ఉన్నారు.


తొర్రూరులో ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహం వద్ద నివాళ్లర్పిస్తున్న ప్రజాసంఘాల నాయకులు


మాధవపురంలో జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న హెచ్.ఎం.సంకా బద్రినారాయణ


నలంద డిగ్రీ కళాశాలలో సార్‌కు నివాళులర్పిస్తున్న డోలి సత్యనారాయణ


మహబూబాబాద్‌లో అదనపు ఎస్పీ చెన్నయ్య


మానుకోట ప్రభుత్వ ఆస్పత్రిలో జయశంకర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సూపరింటెండెంట్, వైద్యులు

జిల్లా వ్యాప్తంగా జయశంకర్‌సార్ జయంతి

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 6 : జిల్లా వ్యాప్తంగా తెలంగాణ జాతిపిత, ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలను మంగళవారం నిర్వహించారు. మహనీయులు జయశంకర్ చిత్రపటాలు, విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక మునిసిపల్ కార్యాలయంలో జయశంకర్ జయంతి వేడుకలను పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చైర్మన్ రాం మోహన్ రెడ్డి మాట్లాడారు. తన కంఠంలో ప్రాణమున్నంత వరకు తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం పరితపించిన వ్యక్తి జయశంకర్ అని కొనియాడారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతీ ఒక్కరు పాటు పడాలని కోరారు. వైస్‌చైర్మన్ మార్నేని వెంకన్న, కమిషనర్ నోముల రవీందర్, ఫ్లోర్‌లీడర్లు సూర్నపు సోమయ్య, బి.అజయ్ సారథిరెడ్డి, కౌన్సిలర్లు ఎడ్ల వేణుమాధవ్, పోతురాజు రాజు, దండెబోయిన బుజ్జివెంకన్న, దౌలాగర్ స్వాతిశం కర్, వట్టం జ్యోత్స్న, నిమ్మల శ్రీనివాస్, ఎడ్ల రమేష్, మార్నేని కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.


నెల్లికుదురులో జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

- నలంద డిగ్రీ కళాశాలలో జయశంకర్ జయంతి, ప్రజా గాయకుడు గద్దర్ వర్ధంతిని నిర్వహించారు. వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కళాశాల కరస్పాండెంట్ డోలి సత్యనారాయణ మాట్లాడుతూ నేటి విద్యార్థులు మహనీయులు ప్రొఫెసర్ జయశంకర్, ప్రజాగాయకులు గద్దర్‌ను ఆదర్శంగా తీసు కోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రిన్సిపాల్, వై.కృష్ణ ప్రసాద్, కేబీ.శంకర్, కె.ప్రసాద్, జి.శ్రీపాల్‌రెడ్డి, సీహెచ్.ప్రసాద్, రమేష్, ఉప్పలయ్య, ముత్తయ్య యాకూబ్, పాషా, రాజు, రవి, రేణుక, నరేష్, శేఖర్ పాల్గొన్నారు.
- మానుకోట జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వైద్యులు జగదీశ్వర్, సుధాకర్, అయేషాబేగం, లక్ష్మి, గఫార్, రామాంజనేయులు, టీఎన్జీవోస్ రాష్ట్ర కార్యదర్శి పమ్మి నాగబ్రహ్మచారి పాల్గొన్నారు.
- నూకల రామచంద్రారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌నాయక్, అధ్యాపకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల వేడుకలో ప్రిన్సిపాల్ పి.సదానందం, అధ్యాపకులు పర్వీన్‌బేగం, కుమార్, సాధిక్‌అలీ, రవికిరణ్, చొప్పరి శ్రీనివాస్, రియాజ్, శ్రీను, సురేందర్, కిరణ్‌కుమార్, స్వాతి, సరిత, పావని, సృజన , నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.
- తెలంగాణ (కాకతీయ) ప్రైవేట్ కాలేజ్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సంకెపల్లి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నీలం వెంకటేశ్వర్లు, బానోత్ మంగిలాల్, ధారావత్ హరిలాల్, ఎం. రాజిరెడ్డి, వీరన్న, ప్రసాద్, మురళీ, రాజేష్ పాల్గొన్నారు.
- ఈదులపూసపల్లిప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం. సోమగోవర్ధన్, ఉపాధ్యాయులు వేణుగోపాల్, అనిత, సత్యనారాయణరెడ్డి, సీహెచ్.సుధాకర్, పి.సింధూజ, బి.వసంత, నిర్మల, భారతి, పద్మ పాల్గొన్నారు.
- శనిగపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం. దాశరథి శ్రీధర్, ఉపాధ్యాయులు జి.వెంకన్న, బి.వెంకన్న, సీహెచ్.ప్రభాకర్, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం మంజుల, సువర్ణ, సునిత, బాలు పాల్గొన్నారు.
- ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మదార్, డీపీ. గణేష్, నయన్‌పాషా, నాగిరెడ్డి, అప్పారావు, షహీద్, ఆండాలు, హసినాబేగం, అయేషా, హేలు నాయక్, బాలరాజు, సారయ్య పాల్గొన్నారు.
- జడ్పీహెచ్ఎస్ మాధవపురంలో హెచ్ఎం.సంకా బద్రినారాయణ, వెంకన్న, స్నేహలత, నాగయ్య, చంద్రశేఖర్, సుజాత, రమాదేవి, సౌభాగ్యవీరన్న, పాల్గొన్నారు.
- గాంధీపురం పాఠశాల వేడుకలో హెచ్ఎం గుగులోతు హేల్యానాయక్, రవికుమార్, ఎ.వెంకటేశ్వర్లు, భవానీ, నవత పాల్గొన్నారు.
- కంబాలపల్లి ఉన్నతపాఠశాల వేడుకల్లో హెచ్ఎం రమేష్‌బాబు, ఉపాధ్యాయులు విష్ణువర్ధన్, సోయన్‌బీ, శ్రీధర్‌రెడ్డి, తిరుపతి, శిభారాణి, సతీష్‌కుమార్, ఝాన్సీ, మల్లారెడ్డి, వీరభద్రం పాల్గొన్నారు.
- కంబాలపల్లి ప్రాథమిక పాఠశాలలో జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హెచ్ఎం. గుగులోతు లక్ష్మి, ఉపాధ్యాయులు రవి, సువర్ణ, కవిత, రాధిక పాల్గొన్నారు.
- జిల్లా పోలీస్ శాఖ కార్యాలయంలో జయశంకర్ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి జిల్లా అదనపు ఎస్పీ చెన్నయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. సైబర్ క్రైమ్ డీఎస్పీ శ్రీనివాస్, ఆర్ఐ అడ్మిన్ అనిల్ పాల్గొన్నారు.
- జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్‌వో కళావతిబాయి, అధికారులు పాల్గొన్నారు.

వివిధ మండలాల్లో..

- చిన్నగూడూరు మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక అధికారి వరలక్ష్మి, ఎంపీడీవో రామారావు, సురేష్, ఉగ్గంపల్లిలో కార్యదర్శి రాము, అంగన్‌వాడీ టీచర్లు జయశంకర్ చిత్రపటం వద్ద నివాళ్లర్పించారు.
- మరిపెడ మండల పరిషత్‌లో సార్ చిత్రపటానికి ఎంపీడీవో విజయ, సీతారాంపూర్ పాఠశాలలో అర్జున్, సందీప్, మహేష్ పాల్గొన్నారు.
- కేసముద్రం శ్రీవివేకవర్ధిని హైస్కూల్లో కరస్పాండెంట్ చిర్ర యాకాంతంగౌడ్, ప్రిన్సిపాల్ చిర్ర నరేష్, మార్కెట్ కార్యాలయంలో ప్రత్యేక హోదా కార్యదర్శి అమరలింగేశ్వర్‌రావు, కేసముద్రం విలేజ్ హైస్కూల్లో ఇన్‌చార్జ్ హెచ్ఎం చీకటి వెంకట్రాంనర్సయ్య, తాళ్లపూసపల్లి హైస్కూల్లో హెచ్ఎం కోట కనకయ్య జయశంకర్ చిత్రపటాల వద్ద పూలమాల వేసి నివాళ్లర్పించారు.
- మరిపెడ మండలం గాలివారిగూడెం పాఠశాలలో జయశంకర్ చిత్రపటం వద్ద పీఆర్టీయూ మండల ప్రధాన కార్యదర్శి లింగాల మహేష్‌గౌడ్, మంగీలాల్, సందీప్, ఆదిలక్ష్మి, వెంకన్న, రవి పాల్గొన్నారు.
- దంతాలపల్లి మండలకేంద్రంతో పాటు పలు గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో జయశంకర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్లర్పించారు. వేణు మాధవ్, సుమన్, వెంకన్న పాల్గొన్నారు.
- నర్సింహులపేట మండలంలోని తహసీల్దార్, ఎంపీడీవో, ఐకేపీ, పోలీస్ కార్యాలయాల్లో ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటం వద్ద నివాళ్లర్పించారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీవో మాధవి, ఏపీఎం వీరయ్య, ఎస్సై సతీష్‌లు పాల్గొన్నారు.
- పెద్దవంగర కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జయశంకర్ చిత్రపటంకు పూలమాల వేసి నివాళ్లర్పించగా మండల పార్టీ అధ్యక్షుడు ముద్దసాని సురేష్, నాయకులు పూర్ణచందర్, మురళీగౌడ్, శ్రీనివాస్, వెంకన్న, రవీందర్‌రెడ్డి, లింగమూర్తి, లక్ష్మణ్, సోమన్న, అంజయ్య, వినోద్, హన్మ్యనాయక్, సంపత్ పాల్గొన్నారు.
- తొర్రూరులో జయశంకర్ విగ్రహానికి జయశంకర్ విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళ్లర్పించగా తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ నర్సయ్య, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో వేణుమాధవ్ జయశంకర్ చిత్రపటాల వద్ద పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. మునిసిపల్ చైర్మన్ రాం చంద్రయ్య, వైస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, దేవరకొండ కృష్ణప్రసాద్, శ్రీనివాస్, రవి, వెంకన్న పాల్గొన్నారు.
- నెల్లికుదురు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జయశంకర్ చిత్రపటంకు స్థానిక ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ పూలమాల వేసి నివాళ్ళర్పించారు. ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీవో బాలరాజు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.
- కురవి : తెలంగాణ ఉద్యమానికి జయశంకర్ వెన్నుదన్నుగా నిలిచారని హెచ్ఎం ధారావత్ వెంకన్న అన్నారు. సూదనపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో సార్ జయంతిని నిర్వహించారు. ఉపాధ్యాయులు చిన్నం ప్రదీప్, అంజాద్‌పాషా, బాలరాజు, సారంగం, గ్రామ కార్యదర్శి మహేష్ పాల్గొన్నారు.
- గార్ల : స్థానిక బస్‌స్టాండ్ సెంటర్‌లోని జయశంకర్ విగ్రహానికి పలువురు ప్రముఖులు పూలమాలవేసి నివాళులర్పించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంగవత్ లక్ష్మణ్‌నాయక్, ఎండీ షఫీవుద్దీన్, కాంగ్రెస్ నాయకులు తాళ్లపల్లి కృష్ణగౌడ్, షంషాంద్ బేగం పాల్గొన్నారు.

రోడ్ల పరిశుభ్రత పనులు చేపట్టాలి

- మునిసిపల్ చైర్మన్ రాంమోహన్‌రెడ్డి

మహబూబాబాద్ టౌన్, ఆగసు 6 : రోడ్లవెంట చెత్తను తొలగించి పరిశుభ్రత పనులు చేపట్టాలని మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి అన్నారు. స్వచ్ఛదనం, పచ్చదనంలో భాగంగా మునిసిపల్ 19వవార్డు పరిధిలోని కురవి రోడ్, మైనార్టీ స్కూల్ వద్ద పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వ ఉన్న ప్రాంతాల్లో మంగళవారం బ్లీచింగ్ పౌడర్ వేయించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. మురికినీరు నిల్వ ఉండకుండా చూడాలని సూచించారు. మెప్మాడీఎంసీ విజయ, వార్డు ఆఫీసర్ కృష్ణయ్య, ఆర్పీలు ఉమా, రాజమణి, అంగన్‌వాడీ టీచర్ పద్మ పాల్గొన్నారు.

- స్వచ్ఛదనం-పచ్చదనంలో భాగంగా మునిసిపల్, నీటి పారుదల శాఖ అధికారులు పట్టణంలోని బంధం, రాంభద్రు, కంబాల చెరువులను పరిశీలించారు. అందులో చెత్త ఏమైనా ఉందా లేదా అని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారి సాయిరాం, నీటి పారుదల శాఖ ఏఈ శ్రావణి పాల్గొన్నారు.

అణగారిన, బలహీనవర్గాల గుండె చప్పుడు గద్దర్

- గిరిజన సామాజిక చైతన్య వేదిక అధ్యక్షుడు గుగులోతు కిషన్‌నాయక్


గద్దర్ ఫ్లెక్సీ వద్ద నివాళులర్పిస్తున్న కిషన్‌నాయక్

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 6 : పీడిత, తాడిత, శ్రామిక, అణగారిన, బలహీన వర్గాల గుండె చప్పుడు ప్రజా గాయకులు గద్దర్ అని గిరిజన సామాజిక చైతన్య వేదిక అధ్యక్షుడు గుగులోతు కిషన్‌నాయక్ కొనియాడారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో గిరిజన సామాజిక చైతన్య వేదిక ఆధ్వర్యంలో మంగళవారం సాంస్కృతిక యుద్ధనౌక గద్దర్ ప్రథమ వర్ధంతిని నిర్వహించారు. ఆయన ఫ్లెక్సీకి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజాసంఘాల నాయకులు గుగ్గిళ్ల పీరయ్య, గుగులోతు బీమా, దుడ్డెల రాంమూర్తి, న్యాయవాదులు వాసం ఆనంద్, వి.సతీష్, గుంజె హన్మంతు, రవివర్మ, చేపూరి గణేష్, భిక్షపతి, బావ్‌సింగ్, సూర్యప్రకాశ్, రామరావు పాల్గొన్నారు.

ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఫొటోగ్రఫీ ఆర్టిస్ట్ అవార్డుకు ఫకృద్దీన్ ఎంపిక



మరిపెడ, ఆగస్టు 6 : ఏటా ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఫొటోగ్రఫీ సంస్థ ఇచ్చే అత్యున్నత అవార్డుకు మరిపెడ లోని సమీర్ డిజిటల్ స్టూడియో ఫొటోగ్రాఫర్ ఎస్కే. ఫకృద్దీన్‌ను ఏఎఫ్ఐపీ మంగళవారం ప్రకటించింది. ఫొటోగ్రఫీడే సందర్భంగా ఆ సంస్థ ఫకృద్దీన్‌కు గోల్డ్ మెడల్ అందజేయనుంది. ఫెడరేషన్ ఆఫ్ ఇండియాన్ ఫొటోగ్రఫీ ఆర్టిస్ట్‌గా ఎంపికైన ఫకృద్దీన్‌కు ఉమ్మడి జిల్లాలోని పలువురు ఫొటోగ్రాఫర్లు, స్నేహితులు, బంధువులు అభినందనలు తెలిపారు. తనకు ఫొటోగ్రఫీలో గైడ్ చేసిన గురువు హుస్సేన్‌ఖాన్‌కు ఫకృద్దీన్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

మానుకోట సంతోష్‌కు తెలంగాణ బెస్ట్ ఫోక్ లిరిక్ రైటర్ అవార్డు

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 6 : పట్టణానికి చెందిన అయిలి సంతోష్‌గౌడ్ తెలంగాణ బెస్ట్ ఫోక్ లిరిక్ రైటర్ అవార్డుకు ఎంపికయ్యారు. ఎంస్క్వేర్ ఎంటర్‌టైన్‌మెంట్ ఆధ్వర్యంలో ఈనెల 10న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖపట్టణంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్టార్ సినీఅవార్డ్స్ కార్యక్రమంలో అయిలి సంతోష్ తెలంగాణ బెస్ట్ ఫోక్ లిరిక్ రైటర్ అవార్డును అందుకోనున్నారు. తాను రాసిన ఇప్పటికిప్పుడు వస్తే బాగుండే నాకు సావు అనే లవ్ ఫెయిల్యూర్ పాటకు ఈ అవార్డుకు ఎంపికైనట్లు రచయిత అయిలి సంతోష్ తెలిపారు.

చికిత్స పొందుతూ మతిస్థిమితంలేని వ్యక్తి మృతి

మరిపెడ, ఆగస్టు 6 : మతిస్థిమితంలేని వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో జరిగింది. స్థానిక ఎస్సై తహెర్‌బాబా తెలిపిన వివరాల ప్రకారం. మతిస్థిమితం లేని ఓ వ్యక్తి మరిపెడ బస్టాండ్ సమీపంలో సోమవారం పురుగులమందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన స్థానికులు 108 ద్వారా చికిత్స కోసం మానుకోట జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. చనిపోయిన వ్యక్తి జేబులో లభించిన ఆధార్ కార్డు ప్రకారం ఆదిలాబాద్ జిల్లా గుడి ఆర్మూర్ మండల్ తోంషతండాకు చెందిన రాథోడ్ వసంత్(45)గా గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం అందివ్వడం జరిగిందని ఎస్సై తెలిపారు. మంగళవారం మృతుడి భార్య పుష్పలత ఫిర్యాదు మేరకు మరిపెడ పీఎస్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తహెర్‌బాబా తెలిపారు.

సుష్మాస్వరాజ్ సేవలు ఎనలేనివి : బీజేపీ

తొర్రూరు, ఆగస్టు 6 : భారతీయ జనతా పార్టీ దివంగత నేత కేంద్ర మాజీమంత్రి సుష్మాస్వరాజ్ దేశానికి సేవలు ఎనలేనివని బీజేపీ అర్బన్ అధ్యక్షుడు అలిసేరి రవిబాబు అన్నారు. మంగళవారం సుష్మాస్వరాజ్ వర్ధంతి సందర్భంగా పట్టణంలో అమరవీరుల స్థూపం వద్ద ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. నాయకులు కొలుపుల శంకర్, పులేందర్, సురేష్, శేఖర్, ప్రవీణ్, కిన్నెర యాదగిరి, సోమశేఖర్, సత్యనారాయణ పాల్గొన్నారు.

'న్యాయవాదులపై పోలీసుల దౌర్జన్యం నశించాలి'


మాట్లాడుతున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు

తొర్రూరు, ఆగస్టు 6 : ఇటీవల న్యాయవాదులపై పోలీసుల దాడులు పెరిగిపోతున్నాయని వారి దౌర్జన్యం నశించాలని తొర్రూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.ప్రవీణ్‌రాజ్ అన్నారు. మంగళవారం కోర్టు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనగాలో అడ్వకేట్ అమృతరావు, అతని భార్య కవితపై పోలీసులు దాడి చేయడం సరికాదని ఆయన అన్నారు. బార్ అసోసియేషన్ సెక్రటరీ ఘణపురం రామకృష్ణ, సైదులు, న్యాయవాదులు బండపెల్లి వెంకన్న, ప్రేమ్‌చందర్, ఉమేష్, యాకాంబ్రం, మధుసూదన్, రఘురాంరెడ్డి, ఐలోని, నగేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

నేటి ధర్నాను జయప్రదం చేయాలి

డోర్నకల్, ఆగస్టు 6 : జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో జరుగుతున్న అక్రమ డిప్యూటేషన్లు, అవకతవకలపై సమగ్ర విచారణ చేపట్టాలని టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 7న నిర్వహించే ధర్నా జయప్రదం చేయాలని సంఘం మండల అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, ప్రధాన కార్యదర్శి శివప్రసాద్ పిలుపునిచ్చారు. డోర్నకల్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. సోమనబోయిన శ్రీనివాస్, సాహెబ్‌అలీ, శంకర్, గ్రేసమ్మ పాల్గొన్నారు.

వీరభద్రస్వామి హుండీ ఆదాయం రూ.51.49 లక్షలు

కురవి, ఆగస్టు 6 : కురవి శ్రీవీరభద్రస్వామి ఆదాయం హుండీ ద్వారా 51 లక్షల 49 వేల 50 రూపాయలు లభించినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 28 నుంచి ఆగస్టు 5 వరకు వీరభద్రస్వామి హుండీ ద్వారా రూ.38,75,717, భద్రకాళి అమ్మవారి హుండీద్వారా రూ.12,73,333 ఆదాయం లభించినట్లు పేర్కొన్నారు. ఈ లెక్కింపును దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ కవిత పర్యవేక్షించారు. లెక్కింపులో నాగేంద్ర సత్యసాయి, మహలక్ష్మి గణపతి సేవా ట్రస్టు సభ్యులు పాల్గొన్నారని తెలిపారు.

'విద్యార్థులు సామర్థ్యాలు సాధించేలా బోధన చేయాలి'

సీరోలు, ఆగస్టు 6 : విద్యార్థులు తరగతుల వారీగా పాఠ్యాంశాల్లో సామర్థ్యాలు సాధించేలా బోధన చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి రామారావు అన్నారు. మన్నెగూడెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆకస్మికంగా సందర్శించి పాఠశాల నిర్వహణకు ఉపయోగించే పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలలకు హాజరై ఉపాధ్యాయులు బోధించే పాఠ్యాంశాలను ఎప్పటికప్పుడు నేర్చుకోవాలని సూచించారు. అనంతరం పాఠశాలలో నిర్వహిస్తున్న స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం పరిశీలించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిషేధిత మత్తుపదార్థాలు విక్రయిస్తే చర్యలు

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 6 : ప్రభుత్వ నిషేదిత మత్తు పదార్థాలను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని మహబూబాబాద్ టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ హెచ్చరించారు. మహబూబాబాద్ జిల్లాకేంద్రంలోని పలు పార్శిల్ కార్యాలయాలు, కిరాణాషాపులు, బస్టాండ్‌లు, అనుమానిత ఇండ్లలో నార్కోటిక్ జగిలంతో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎవరైనా మత్తు పదార్థాలు విక్రయిస్తున్నట్లు సమాచారం ఉంటే డయల్ 100కు లేదా దగ్గరలోని పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని సూచించారు.

ఎంపీడీవో కార్యాలయం ఎదుట జీపీ కార్మికుల ధర్నా

కేసముద్రం, ఆగస్టు 6 : ఎంపీడీవో కార్యాలయం ఎదుట మంగళవారం తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ అనుబంధ గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు జాటోత్ మంగీలాల్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏళ్ల తరబడి జీపీల్లో పనులు చేస్తున్నప్పటికీ తమకు అరకొర వేతనాలే ఇస్తున్నారని అన్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి జల్లె జయరాజ్, బిర్రు కనకలక్ష్మి, టేకుల శ్రీను, కొమ్ము భాస్కర్, లింగాడపు యాకయ్య, శ్రవణ్, యాకమ్మ, పద్మ, ప్రశాంత్, సుగుణ, సంజీవ, యాకయ్య, తిరుపతయ్య, దాస్యం హరీష్ పాల్గొన్నారు.

'ఉపాధి'పై అనుమానాలు!

(5వ పేజీ తరువాయి)

చూడనున్నాయి. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ కార్యాలయాల్లో పనులు, కూలీలు, పని దినాలకు సంబంధించిన రికార్డులను తయారుచేసే పనిలో అధికారులు నిమగ్నమై ఉన్నారు. ఈ వేసవిలో కూలీలు ఇతర ప్రాంతాలకు వెళ్లి పనులు వెతుక్కునే అవకాశం లేకుండా స్థానికంగానే ఉపాధి పథకం కింద పనులు చూపిస్తామని అధికారులు గ్రామాల్లో ప్రచారం నిర్వహించడంతో కూలీల సంఖ్య పెరిగింది. ఉపాధి కూలీ రూ.270 నుంచి రూ.300 పెరగడంతో అధిక సంఖ్యలో పనులు చేసేందుకు కూలీలు ముందుకు వస్తున్నారనేది మరో కారణం. క్షేత్ర స్థాయిలో వారానికి ఒక రోజు పనులు పరిశీలించడంతో పాటు, కూలీల హాజరు తక్కువగా ఉన్నచోట పెంచే విధంగా అవగాహన కల్పించారు. వార్షిక ఉపాధి ప్రణాళికలో రూపొందించిన పనులదినాల్లో ఏప్రిల్, మే, జూన్ నెలల్లో 70 శాతానికి చేరుకోవాలనే లక్ష్యంతో సిబ్బంది పని చేశారు. దీంతో కూలీల హాజరు శాతం పెరిగిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గ్రామాల్లో కూలీలకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో అధికారులు పర్యటనలు చేసి పనులకు రాని వారితో సమావేశాలు నిర్వహించారు. గతంలో ఉపాధి కూలీల వేతనాల కోసం రోజుల తరబడి నిరీక్షించే పరిస్థితి ఉండేది. ప్రస్తుతం సకాలంలో వేతనాలు బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుండడంతో పనులకు వచ్చే వారి సంఖ్య పెరిగిందని అధికారులు అభిప్రాయపడుతున్నారు.


పాకాల ఏటిపై రాంపురం వద్ద వంతెన నిర్మించాలని కోరుతూ ఆందోళన చేస్తున్న బీజేపీ కార్యకర్తలు - గార్ల